

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 04.08.2026 | సంపుటి: 3 | సంచిక: 182 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 04.08.2026 | VOLUME : 3 | ISSUE : 182 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# నిమ్స్‌లో వెయ్యో రోబోటిక్ శస్త్రచికిత్స

- మూడేళ్లలో అరుదైన మైలురాయి.. వైద్య బృందాన్ని అభినందించిన మంత్రి దామోదర
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి ద్వారా ఉచిత చికిత్సలు
- ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక సాంకేతికతకు నిదర్శనమన్న మంత్రి

2



## నిమ్స్ వైద్య బృందానికి సీఎం అభినందనలు

- రెండున్న రేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంపై

**హైదరాబాద్, ఆగస్టు 3 :**
హైదరాబాద్ నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తోపాటు వైద్య బృందం, నర్సింగ్

మిగతా 2వ పేజీలో..



## ఈయేడు కుంభ వృష్టి వర్షాలు తప్పవు

- ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్య వాణిలో మాతంగి వెల్లడి

2

## రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

## కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్

- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపణ
- పోలీసు నియామకాలలోనూ ప్రభుత్వం విఫలమైందన్న విమర్శ
- యూత్ డిక్లరేషన్‌లోని హామీలపై సమాధానం కోరిన బీఆర్‌ఎస్
- సీఎం రేవంత్, రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్

3



## పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ప్రభుత్వ ఒత్తిడి నిజమే: కేటీఆర్

- ప్రభుత్వ వేధింపుల వల్లే సుదర్శన్‌రెడ్డి ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణ
- విద్య, బీసీ రిజర్వేషన్లు, ఐటీ రంగంపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్‌ఎస్
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌కు అవగాహన లేదని విమర్శ

3



## పుట్టిన గడ్డ రుణం తీర్చుకోండి.. పెట్టుబడులతో రండి

- ప్రతీ కార్యక్రమంలో మీ వెన్నంటి ఉంటాం
- ఎన్నారైల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన ప్రత్యేక వ్యవస్థ
- ఆన్‌లైన్‌లో ఓటు హక్కు నమోదు చేసుకోండి: ప్రవాసులకు భట్టి విజ్ఞప్తి

**బాల్టిమోర్ (అమెరికా), ఆగస్టు 3 :**
అనేక కష్టనష్టాలకోర్చి ఖండాంతరాలు దాటి ఉన్నత శిఖరాలకు చేరుకున్న ప్రవాస భారతీయులు తాము సాధించిన విజ్ఞానాన్ని, మేధస్సును సొంత రాష్ట్రం, పుట్టిన గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్

మిగతా 2వ పేజీలో..

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త కోణాలు

- ఇంట్లో సోదాల్లో మరో మహిళతో సంబంధాల ఆనవాళ్లు
- ల్యాప్‌టాప్, ఫోన్, ప్రేమలేఖలు స్వాధీనం
- 20 మందికి పైగా వాంగ్మూలాలు నమోదు చేసిన పోలీసులు

2





## కార్యాచరణతో పర్యావరణ అనుమతులు

- సుప్రీం తీర్పుతో నీటి ప్రాజెక్టులపై న్యాయపరమైన స్పష్టత
- రాష్ట్ర ప్రయోజనాలక నుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- ప్రాధాన్యత జాబితాలో పాలమూరు, సీతారామ, డిండి, గౌరవెల్లి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 3 :**
రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణతో ముందుకు తీసుకెళ్లాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామసాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి

మిగతా 3వ పేజీలో..

## అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

**టిఫైబర్ పనులను గడువులోగా పూర్తి చేయాలి**

**అధికారులకు సీఎస్ సంజయ్ ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్టు 3:**
రాష్ట్రంలో మీసేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ

మిగతా 2వ పేజీలో..



## విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

- ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు
- సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం
- విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు కేంద్రం అంగీకారం
- జంతర్‌మంతర్ ఆందోళనల ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టు విచారణ



4



4

## బంకీపూర్‌లో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం

- 20 వేలకుపైగా మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు
- బీహార్ నాయకత్వంపై ప్రజల తీర్పేనని వ్యాఖ్య
- రాష్ట్ర అభివృద్ధి, యువత ఉపాధిపైనే దృష్టి పెట్టాలని విజ్ఞప్తి




4

## E20 పెట్రోల్ లక్ష్యం ధర తగ్గింపు కాదు: కేంద్రం

- ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే ప్రధాన ఉద్దేశం
- ఇంధన భద్రత బలోపేతానికి ఇథనాల్ మిశ్రమ విధానానికి ప్రాధాన్యం
- రైతుల ఆదాయం పెంపుతో పాటు విదేశీ మారక ద్రవ్యానికి ఆదా

## నిమ్స్ వైద్య బృందానికి సీఎం అభినందనలు

**మొదటిపేజీ తరువాయి**

సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికిపైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్ ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త కోణాలు

**హైదరాబాద్, ఆగస్టు 3:**

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఫిర్యాదుతో అరెస్టైన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. కేసు విచారణను వేగవంతం చేసిన పోలీసులు ఆయన నివాసంలో నిర్వహించిన సోదాల్లో కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

దర్యాప్తులో భాగంగా అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి నివాసాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అక్కడ నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌తో పాటు రెండు వ్యక్తిగత లేఖలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటి ఆధారంగా మరో మహిళతో ఆయనకు సన్నిహిత పరిచయం ఉన్న కోణాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారంలో, వివాహితగా ఉన్న ఒక మహిళతో ఉదయ్ కృష్ణారెడ్డికి పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భర్త నుంచి విడిగా జీవిస్తున్న సమయంలో ఆమెకు ఉద్యోగ అవకాశాల విషయంలో సహకరించినట్లు, అనంతరం వ్యక్తిగత సంబంధాలు కొనసాగించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అయితే దీనిపై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

కేసు నమోదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి కూడా ఆ మహిళను కలిసి మాట్లాడినట్లు సమాచారం. తనకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని ఆమె తెలిపినట్లు విచారణ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాన్ని కూడా పోలీసులు దర్యాప్తులో భాగంగా పరిశీలిస్తున్నారు.

ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి సుమారు 20 మందికి పైగా వ్యక్తుల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేశారు. ట్రైనింగ్ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదులు, ఇతర వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. విచారణను నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ పర్యవేక్షిస్తున్నారు.

ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కొనసాగుతోంది. అవసరమైతే ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారించేందుకు దర్యాప్తు సంస్థలు న్యాయపరమైన చర్యలు చేపట్టే అవకాశముంది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి వాస్తవాలు అధికారిక విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

**మొదటిపేజీ తరువాయి**

బ్యాంకు గ్రూపునకు చెందిన డిజిటల్‌ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సోమవారం సమావేశమయ్యారు. డిజిటల్ ఇండియావికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీసేవ కేంద్రాల ఆధునికీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు (ఏఐ), సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంకు అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయన్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. టిఫైబర్‌పై సమీక్ష అనంతరం టిఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితర అంశాలపై సమీక్షించారు. టిఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, టిఫైబర్ ఎండీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లోపాలు లేని సమాచారం పొందుపరచాలి

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నాణ్యతను మెరుగుపరచేందుకు ఫొటోలు లేకపోవడం, జన్మ తేదీ వ్యత్యాసాలు, లింగ వివరాల్లో పొరపాట్లు, సంతకాలలో లోపాలను సరి చేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆయన అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి డిజిటలైజేషన్ పురోగతి, సంబంధిత అంశాలను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ముఖ్యంగా గైర్హాజరైన, నివాసం మార్చుకున్న, మరణించిన, నకిలీ ఓటర్ల జాబితాల పునఃపరిశీలన, విశ్లేషణ, నో మ్యాపింగ్ కేసులు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఉన్న అన్ని లోపాలను అత్యంత ఖచ్చితత్వంతో సరిదిద్దాలి. అన్ని ఏఎస్‌డీడీ కేసులను తుది నిర్ణయానికి ముందు పునఃపరిశీలించి సరైన వర్గీకరణ చేయాలి. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపు లేకుండా లేదా పొరపాటున తొలగించడం కాకుండా చర్యలు తీసుకోవాలి. లోపాలు గుర్తించిన సందర్భంలో రోల్ బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి, రికార్డులను మళ్లీ పరిశీలించి అవసరమైన సవరణలు చేయాలి. బూత్ లెవల్ అధికారుల, బూత్ లెవల్ సూపర్వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల ద్వారా క్షేత్రస్థాయి ధ్రువీకరణను మరింత బలోపేతం చేయాలి. బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను, గుర్తింపు పొందిన పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలతో సిద్ధం చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. 85 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి సంబంధించిన వ్యత్యాసాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంతో పాటు, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజన జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల ని సూచించారు.

# నిమ్స్‌లో వెయ్యో రోబోటిక్ శస్త్రచికిత్స

**హైదరాబాద్, ఆగస్టు 3:**



మూడేళ్ల వ్యవధిలో వెయ్యి రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా నిమ్స్ వైద్య బృందాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి చేయడం వైద్యులు, నర్సులు, సాంకేతిక నిపుణులు, ఇతర సిబ్బంది అంకితభావానికి నిదర్శనమని మంత్రి అన్నారు. ఈ ఘనత తెలంగాణ ప్రజారోగ్య రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. నిర్వహించిన రోబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల ద్వారా ఉచితంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని మంత్రి తెలిపారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా నిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వివిధ విభాగాల వైద్య బృందాల సేవలను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. వినూత్న వైద్య విధానాలను అనుసరిస్తూ రోగులకు నాణ్యమైన చికిత్స అందిస్తున్న వారి కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా సంక్లిష్ట ఆపరేషన్లలో మరింత ఖచ్చితత్వం సాధ్యమవుతుందని, రోగులు తక్కువ సమయంలో కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ సాంకేతికతను ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రజారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. భవిష్యత్తులో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిగమిస్తూ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# పుట్టిన గడ్డ రుణం తీర్చుకోండి.. పెట్టుబడులతో రండి

**మొదటిపేజీ తరువాయి**



కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా జరిగిన 19వ 'ఆటా' జాతీయ మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాక ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో దీటుగా తెలంగాణ రాష్ట్రం పోటీపడే స్థాయికి తీసుకెళ్తున్నామని, ఈ క్రమంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసులు ముందుకు రావాలని కోరారు. 'మీ కోసం సింగిల్ విండో విధానాన్ని ఏర్పాటు చేశాం. అన్ని అనుమతులు వెంటనే ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. పారిశ్రామికంగా, సామాజికంగా మీరు చేపట్టే ప్రతి కార్యక్రమంలో మేము వెన్నంటి ఉంటాం. మిమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే సీఎం రేవంత్ రెడ్డి నన్ను ఇక్కడికి పంపించారు' అని డిప్యూటీ సీఎం చెప్పారు. తెలంగాణను 2047 నాటికి మ□డు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మలచాలనే స్పష్టమైన ప్రణాళికతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఆనాడు సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణలో నేడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వనరులను సద్వినియోగం చేస్తూ పాలన సాగుతోందన్నారు. పెట్టుబడులకు, పరిశ్రమలకు అత్యంత అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం వేగంగా దూసుకెళ్తోందని వివరించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న 56 కి.మీ మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరిస్తున్నామని, స్వచ్ఛమైన నీరు పారేలా ప్రక్షాళన చేసి నగర రూపురేఖలు మార్చబోతున్నామని వెల్లడించారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం నేడు తెలంగాణకు పెద్ద ఆస్తులుగా మారాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ ఔటర్ రింగ్ రోడ్డును దాటి మిగతా జిల్లాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) నిర్మిస్తున్నామని, వాటిని అనుసంధానం చేస్తూ కొత్తగా 36 రేడియల్ రోడ్లను ప్లాన్ చేశామని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆ ప్రాంతాన్ని ఆనుకుని సరికొత్తగా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రగతికి మానవ వనరుల అభివృద్ధే కీలకమని నమ్మిన ప్రభుత్వం అందుకోసం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు భట్టి తెలిపారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు సైతం అమెరికా దాకా ఎదిగి ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలన్న ఉద్దేశంతోనే ఒకేసారి వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బృహత్తర యజ్ఞంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని, ఏ మూలాల నుంచి వచ్చారో ఆ మూలాలను మర్చిపోకుండా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### ఎన్నారైల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన ప్రత్యేక వ్యవస్థ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు(ఎన్నారైలు), తెలంగాణలో ఉంటున్న వారి తల్లిదండ్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధత(లీగల్ స్టేటస్) కలిగిన ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ ఆలోచనలో ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రవాసులు.. తమ సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక వేదిక కావాలని ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలో ఎక్కడున్న తెలంగాణ వాసులైనా తమ ఇబ్బందులను లేదా రాష్ట్రంలో ఉంటున్న తమ తల్లిదండ్రుల సమస్యలను ఈ ప్రత్యేక వ్యవస్థ దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోందని ప్రవాసులకు గుర్తుచేశారు. తెలంగాణ పౌరులు ప్రపంచంలో ఏ నలుమూలల ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ప్రవాసులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి భరోసా

- **రూ.కోటి బీమా చెక్కు అందజేసిన డీజీపీ**

**హైదరాబాద్, ఆగస్టు 3:**

విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వి.చరణ్ కుమార్ కుటుంబ సభ్యులకు డీజీపీ సి.వి. ఆనంద్ రూ.కోటి బీమా చెక్కును అందజేశారు. మల్కాజిగిరి కమిషనరేట్ 2018 బ్యాచ్ కు చెందిన చరణ్ ఈగల్ ఫోర్స్ డిప్యూటేషన్ విధులు నిర్వహిస్తున్నారు. 2025 సెప్టెంబర్ 2223 తేదీల అర్ధరాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా మహారాష్ట్రలోని దేవార్కర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన కుడి కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్ యశోద హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించగా చికిత్స అనంతరం 2025 అక్టోబర్ 28న హాస్పిటల్‌నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఇంటికి చేరుకున్న కొద్ది సేపటికే అకస్మాత్తుగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు మళ్లీ యశోద హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ఆయన మృతిచెందినట్లు ప్రకటించారు. కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ షాండిల్య, ఎస్పీ రఘువీర్, అదనపు ఎస్పీ కృష్ణమూర్తి తదితర అధికారులు ఎస్బీఐతో సమన్వయం చేసి బీమా క్లెయిమ్ ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఈయేడు కుంభ వృష్టి వర్షాలు తప్పవు

**హైదరాబాద్,ఆగస్టు 3 :**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత సోమవారం భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ఠ చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా, ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తున్నాయని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని, అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కుంభ వర్షాలు ఉన్నాయని మాతంగి భవిష్య వాణిలో చెప్పారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదన్నారు. భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించారు.



**మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం**

**-జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన**

మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిల ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆమె ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని శ్యామల డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు జోగినిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని జోగినిలు ఆలయంలోకి ప్రవేశించారు. జోగినిల ఆందోళనతో రంగం కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. ఆందోళనతో ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు జోగినిలతో మాట్లాడి ఆందోళనను విరమించాలని మంత్రి పొన్నం కోరారు.

**జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు : మంత్రి పొన్నం**

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతోపాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు ప్రజలందరికీ శుభ దినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో వారిని కోఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి చేశారు.

# కార్యాచరణతో పర్యావరణ అనుమతులు

మొదటిపేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతీ అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

**సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత**

సుప్రీంకోర్టు తాజా తీర్పులోని అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్ గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తీర్పు వెనుక రాష్ట్ర ప్రభుత్వం నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**అంతర్రాష్ట్ర విభాగాన్ని మరింత బలోపేతం చేయాలి**

రాష్ట్ర సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటు చేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు.. ఇలా ప్రతీ అంశాన్ని సమగ్రంగా ఒకే రికార్డుగా పొందుపరచాలని ఆదేశించారు.

**ఏడు రోజుల నుంచి ఆరు నెలల వరకు స్పష్టమైన కార్యాచరణ**

పర్యావరణ అనుమతుల సాధనకు దశలవారీ కార్యాచరణను నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన రికార్డులను 30 రోజుల్లో సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతో పాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.

**రైతులు, నిర్వాసితుల హక్కులకు రక్షణ**

ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం.. ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా కార్యాచరణ కొనసాగాలని సూచించారు.

**గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి**

గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేం దుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను, ఎసఓపీలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి ప్రవాహానికి ఉన్న అవరోధాలను గుర్తించి అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలరు. అసంపూర్తిగా ఉన్న కాల్వ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

**అనుమతి రాగానే సీతారామ సాగర్ పనులు**

సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతీ ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయవ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసులకు సమన్వయ వ్యూహం**

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతీ పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ న్యాయ బృందం, శాఖాధికారులను ఆదేశించారు.

**పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా రాష్ట్రంలోని ప్రాంతాలపై పడే ప్రభావాన్ని కూడా విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్ ఆదేశించారు. రాష్ట్ర వాదన కేవలం అంచనాలపై కాక విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సంబంధిత ఇతర సంస్థల వద్ద రాష్ట్ర ప్రయోజనాలను దృఢంగా వినిపించాలని సూచించారు. పోలవరం పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆదేశించారు. పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి రాష్ట్రానికి సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్ ఆదేశించారు. సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్, ఇంజినీర్ఇన్‌చీఫ్(జనరల్) ఓ.వీ. రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీర్ఇన్‌చీఫ్(అడ్మిన్) పి.శ్రీనివాస్, ఇంజినీర్ఇన్‌చీఫ్(ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 'సీతమ్మసాగర్'ను త్వరితగతిన పూర్తిచేయాలి : మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లాలో గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన పాల్గొన్నారు. 'సీతమ్మసాగర' ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందన్నారు. నిర్దేశిత గడువు లోపు ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు అంకితం చేయాలనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ప్రభుత్వ ఒత్తిడి నిజమే: కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 3:**

దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ ఒత్తిడికి గురయ్యారన్న విషయం వాస్తవమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వంలోని పలు అక్రమాలను ఆధారాలతో బయటపెట్టిన తర్వాత వేధింపులు ఎదుర్కొన్నారని అన్నారు. తనపై అక్రమ కేసులు పెడుతున్నారని సుదర్శన్‌రెడ్డి తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేయగా, న్యాయపరంగా పోరాడాలని సూచించినట్లు తెలిపారు. సుదర్శన్‌రెడ్డి సివిల్ సప్లైస్ శాఖ, విద్యాశాఖలో జరిగిన అవినీతి వ్యవహారాలకు సంబంధించిన ఆధారాలను సేకరించి అమలు సంస్థలకు అందజేశారని కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఆయన మరణించిన మరుసటి రోజే కేసుకు సంబంధించి న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులను వేధించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ విమర్శించారు. విద్యా హక్కు చట్టం అమలుపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చట్ట స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో జరిగిన ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపిస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వేలాది ఐటీ ఉద్యోగాలు తగ్గాయని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలను కూడా కేటీఆర్ తప్పుబట్టారు. గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గాయత్రి, నందిమేడారం పంప్‌హౌస్‌ల ద్వారానే నీటి ఎత్తిపోతలు జరుగుతున్నాయని పేర్కొంటూ, ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులకు సరైన అవగాహన లేదన్నారు. మెట్రో ప్రాజెక్టు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల విషయంలో కూడా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి పథకం వెనుక అవినీతి ఉందని విమర్శిస్తూ, బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను అణచివేయాలనే ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
# కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 3:**

తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగులకు పలు హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసినప్పటికీ రెండేళ్లు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత తీవ్ర నిరాశకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసిందని కేటీఆర్ ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పదివేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్నారు.

ఇంజినీరింగ్ పట్టభద్రులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా కేటీఆర్ తప్పుబట్టారు. యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన 24 హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించారు. తెలంగాణ యువత ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ నాయకత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి విద్యార్హతలపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని ఎప్పుడు నెరవేర్చుతుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

- **ఆర్. కృష్ణయ్య**
- **పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి**
- **ఏపీ తరహా విధానాన్ని తెలంగాణలో అమలు చేయాలని**

**హైదరాబాద్, ఆగస్టు 3:**

ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆలస్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం చేపట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనను ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుడిగా పేర్కొంటూ అక్కడి సమస్యలపైనే మాట్లాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదని ఆర్. కృష్ణయ్య అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల విద్యా వ్యయాన్ని ప్రభుత్వం పూర్తిగా భరిస్తోందని, తెలంగాణలో మాత్రం అందుతున్న ఆర్థిక సాయం వాస్తవ ఖర్చులకు సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తెలంగాణలో కూడా పూర్తి విద్యా వ్యయాన్ని ప్రభుత్వం భరించే విధానాన్ని అమలు చేయాలని ఆర్. కృష్ణయ్య కోరారు. పెండింగ్ చెల్లింపులతో పాటు సమగ్ర సహాయ విధానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నేటి నుంచి హైదరాబాద్‌లో 'బ్రిక్స్' ఏసీడబ్ల్యూజీ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం(ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశానికీ, ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశానికీ భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిబ్బంది, శిక్షణ విభాగం(డీవోపీటీ) ఆతిథ్యమివ్వనుంది. బ్రిక్స్2026కు భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ సమావేశాలు జరుగుతాయి. బ్రిక్స్ ఇతివృత్తమైన 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం స్ఫూర్తిగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ప్రారంభిస్తారు. బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులతోపాటు సీనియర్ విధాన రూపకర్తలు, నిపుణులు, ప్రాక్టీషనర్లు, అవినీతి నిరోధక, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. జూన్ 2,3 తేదీల్లో వర్చువల్‌గా జరిగిన బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం మొదటి సమావేశం ఫలితాల ఆధారంగా హైదరాబాద్ సమావేశం జరుగుతోంది. ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిని ఎదుర్కోవడం, పాలనలో పారదర్శకతనూ, జవాబుదారీతనాన్నీ పెంపొందించడంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై బ్రిక్స్ సభ్యదేశాలు చర్చిస్తాయి. దిగువ పేర్కొన్న అంశాల ద్వారా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తాయి. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీని గుర్తించేందుకు, అప్పగింత ప్రక్రియలకు మద్దతు ఇవ్వడానికి అనధికారిక సహకారాన్ని బలోపేతం చేయడం.. ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ ద్వారా సమాచారాన్ని పంచుకోవడం.. కార్యాచరణ సహకారాన్ని విస్తరించడం.. ఫిన్‌టెక్, డిజిటల్ ఆస్తులు, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక సాధనాల నుంచి ఉత్పన్నమయ్యే అవినీతి సంబంధిత ప్రమాదాలను నివారించడంలో, ఎదుర్కోవడంలో అనుభవాలనూ, ఉత్తమ పద్ధతులనూ పంచుకోవడం. ఆవిష్కరణ, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన అనే అంశంపై ఈనెల 5న ప్రత్యేక అనుబంధ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థ, పౌర భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం, పరిపాలనలో నిజాయతీని బలోపేతం చేయడానికి ఆవిష్కరణాత్మక విధానాలతో సాంకేతిక ఆధారిత పరిపాలనపై తమ అనుభవాలను పంచుకోవడానికి బ్రిక్స్ సభ్యులకు వేదికగా ఈ అనుబంధ కార్యక్రమం నిలుస్తుంది. చర్చలు, అనుభవాలను పంచుకోవడం, సహకార కార్యక్రమాల ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని ప్రోత్సహించాలనే భారత్ చిత్తశుద్ధిని హైదరాబాద్ సమావేశం తెలియజేస్తోంది.

# ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

- **19వేల పోలీస్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి**

**హైదరాబాద్,ఆగస్టు 3:**

రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జాప్యం కారణంగా వేలాదిమంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత



ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతోపాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి పేరుతో రాజకీయం తగదు: మంత్రి పొంగులేటి

- **పదేళ్ల పాలనలో సముచిత గుర్తింపు ఎందుకు ఇవ్వలేదు**
- **కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవప్రదంగా వ్యవహరించింది**
- **ఉద్యమకారులను ఓట్లకే పరిమితం చేసిన బీఆర్ఎస్**
- **మరణాలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదు**

**హైదరాబాద్, ఆగస్టు 3:**

దివంగత మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించిన ఆయన, సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్న సమయంలో గుర్తింపు ఇవ్వని బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పుడు ఆయన పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వలేదని, ఎమ్మెల్యేగా ఓటమి చెందిన తర్వాత రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి అవకాశాలు కూడా కల్పించలేదని పొంగులేటి ప్రశ్నించారు. ఇతరులకు కీలక పదవులు ఇచ్చిన పార్టీ నాయకత్వం ఆయన విషయంలో ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శించిందని నిలదీశారు.

తమ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యానికి గురైన సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసిందని, మరణానంతరం అధికారిక పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి గౌరవం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యమానికి చేసిన సేవలను గౌరవించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు.

ఉద్యమకారులను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఉపయోగించుకుని, అధికార ప్రయోజనాలను కొద్దిమందికే పరిమితం చేయడం బీఆర్ఎస్ విధానమని పొంగులేటి ఆరోపించారు. మరణాలను కూడా రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించడం ప్రజలు గమనిస్తున్నారని, అలాంటి రాజకీయాలకు తెలంగాణ ప్రజలు తగిన సమయంలో సమాధానం ఇస్తారని అన్నారు.

# E20 పెట్రోల్ లక్ష్యం ధర తగ్గింపు కాదు: కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:**

ఇథనాల్ మిశ్రమ ఇంధనమైన E20 పెట్రోల్‌ను ప్రవేశపెట్టిన ఉద్దేశం పెట్రోల్ ధరలను తగ్గించడం కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశం విదేశీ ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడం, భవిష్యత్తులో అంతర్జాతీయ చమురు ధరల ప్రభావాన్ని తగ్గించడమే ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యమని వెల్లడించింది. దేశవ్యాప్తంగా E20 పెట్రోల్ వినియోగంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, మైలేజ్ తగ్గుతుందనే అభిప్రాయాలు, ఇంజిన్ పనితీరుపై వ్యక్తమవుతున్న సందేహాల మధ్య కేంద్రం తన వైఖరిని వివరించింది. E20 ఇంధనంలో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ ఉంటుందని, ఇథనాల్‌ను చెరకు, మొక్కజొన్నతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి దేశీయంగానే తయారు చేస్తున్నట్లు తెలిపింది. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచడం వల్ల విదేశాల నుంచి ముడి చమురు దిగుమతుల అవసరం తగ్గుతుందని ప్రభుత్వం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల్లో వచ్చే హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు దేశీయ ఇంధన వనరుల వినియోగం పెరిగే అవకాశం ఉంటుందని వివరించింది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ద్వారా భారీ స్థాయిలో ముడి చమురు దిగుమతులకు ప్రత్యామ్నాయం లభించిందని కేంద్రం తెలిపింది. ఈ కార్యక్రమం వల్ల సుమారు 31 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులు తగ్గడంతో పాటు రూ.1.90 లక్షల కోట్లకు పైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్లు వెల్లడించింది. 2022 నుంచి 2026 మధ్య ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు గణనీయంగా పెరిగినా, భారత్‌లో ధరల పెరుగుదల పరిమితంగానే నమోదైందని పేర్కొంది. ఇథనాల్ ఉత్పత్తి విస్తరణతో రైతులకు అదనపు మార్కెట్ లభిస్తుందని, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు గిరాకీ పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని కేంద్రం తెలిపింది. దేశాన్ని ఇంధన పరంగా మరింత స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, దీర్ఘకాలిక ఇంధన భద్రత సాధించడమే E20 విధానం ప్రధాన ఉద్దేశమని మరోసారి స్పష్టం చేసింది.






# హామీలతో మోసగిస్తున్న పాలకులు!

- మారుతున్న ప్రభుత్వాలు.. మారని ప్రజల కష్టాలు

ప్రభుత్వాలు మారుతున్నాయి. ముఖ్యమంత్రులు మారుతున్నారు. పార్టీ జెండాలు, నినాదాలు మారుతున్నాయి. కానీ ప్రజల సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోతున్నాయి. ఎన్నికల ముందు గుప్పించే హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా మరుగున పడుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని ఓట్లుగా మార్చుకోవడంలో చూపే చురుకుదనం, ఆ హామీల అమలులో మాత్రం కనిపించడం లేదు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లకు చేరువవుతున్నా కీలక సమస్యలపై ఇంకా స్పష్టత కనిపించడం లేదు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పెద్దఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు అక్రమంగా చేతులు మారాయి, ఎవరెవరు లబ్ధి పొందారు, ఎంత ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది అన్న అంశాలపై ప్రజలకు సమగ్ర సమాచారం అందలేదు. దేవాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల భూములు అక్రమ ఆక్రమణలకు గురయ్యాయన్న ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. కొందరు వాటికి పట్టాలు సృష్టించుకుని రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూములను కాపాడలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్ణయాత్మక చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దేవాదాయ, ప్రభుత్వ భూముల పరిరక్షణపై పాలకులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం విషయంలోనూ విమర్శలు, ప్రత్యారోపణలే తప్ప ప్రజలకు ఉపయోగపడే పరిష్కారం కనిపించడం లేదు. ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరగాల్సిందే. అదే సమయంలో ప్రజాధనంతో నిర్మించిన వ్యవస్థలో ఉపయోగించగల భాగాలను శాస్త్రీయంగా వినియోగంలోకి తీసుకురావడంపైనా దృష్టి పెట్టాలి. రాజకీయ ఆధిపత్య పోరాటంలో ప్రజల ప్రయోజనాలు బలికాకూడదు. జర్నలిస్టుల సమస్యల విషయంలోనూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోంది. అక్రిడిటేషన్లు, ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి అంశాలు సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు కేటాయించిన భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. న్యాయస్థాన తీర్పులను చూపిస్తూ వేల కోట్ల విలువైన భూములను ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టుల సంక్షేమం గురించి సభల్లో చెప్పే మాటలు కార్యరూపం దాల్చకపోతే వాటికి విలువ ఉండదు. అన్నింటికన్నా తీవ్రమైన సమస్య నిరుద్యోగం. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలకు సంఘీభావం ప్రకటించే రాజకీయ నాయకులు, తమ రాష్ట్రాల్లోని నిరుద్యోగుల ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. 2024 ఆగస్టు 2న అసెంబ్లీ వేదికగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ రెండేళ్లు గడిచినా అందులో పేర్కొన్న నోటిఫికేషన్లలో చాలావరకు వెలువడలేదన్న అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉంది. జాబ్ క్యాలెండర్‌కు కాలపరిమితి ముగిసిపోయినా బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం లేదు. యువజన డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల పరిస్థితీ ఇదే. నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డు, వడ్డీలేని రుణాలు, యువతులకు విద్యుత్ స్కూటీలు వంటి హామీలు కాగితాలపైనే మిగిలిపోయాయని యువత ఆరోపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో వేలాది నియామకాలు చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన మొత్తం హామీలతో పోలిస్తే ఇంకా పెద్ద అంతరం కనిపిస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు వేలల్లో ఉన్నాయి. పాఠశాల విద్యాశాఖలో వేలాది ఉపాధ్యాయ పోస్టులు, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టులు, గురుకులాలు, పోలీసు, ఆర్టీసీ, అంగన్‌వాడీలు, ఎక్సైజ్, మైనారిటీ సంక్షేమ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నట్లు వివిధ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నా, ఆ మేరకు నియామకాలు జరగకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతోంది. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యకు సమానంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. శాశ్వత ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక నియామకాలే ప్రభుత్వాలకు అనుకూల మార్గంగా మారాయి. దీనికి గత ప్రభుత్వాలన్నీ బాధ్యత వహించాల్సిందే. ఇంటికో ఉద్యోగం, లక్షల నియామకాలు అంటూ గతంలో బీఆర్ఎస్ చేసిన ప్రకటనలు కూడా నిరుద్యోగుల ఆశలను నెరవేర్చలేకపోయాయి. తెలంగాణలో కేసీఆర్, రేవంత్ రెడ్డి అయినా.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్ అయినా ఎన్నికల సమయంలో ప్రజలకు భారీ హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు, గత ప్రభుత్వ అప్పులు, న్యాయపరమైన చిక్కులు వంటి కారణాలను చూపుతూ అమలును వాయిదా వేస్తున్నారు. ప్రజలు మాత్రం ప్రతి ఎన్నికలో కొత్త ఆశతో ఓటేస్తూ, తరువాత మళ్లీ నిరాశలో మునిగిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో హామీ అనేది కేవలం ఎన్నికల ప్రచార నినాదం కాదు. అది ప్రజలతో చేసుకున్న ఒప్పందం. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత పాలకులపై ఉంటుంది. హామీలు నిలబెట్టుకోలేని ప్రభుత్వాలు కనీసం ప్రజలకు నిజాయతీగా పరిస్థితిని వివరించాలి. కాలపట్టిక ప్రకటించాలి. పురోగతిని వెల్లడించాలి. మాటలతో ప్రజలను కొంతకాలం మభ్యపెట్టవచ్చు. కానీ నిరుద్యోగి నిరీక్షణను, రైతు నష్టాన్ని, జర్నలిస్టు ఆవేదనను, భూమి కోల్పోయిన పేదవాడి బాధను శాశ్వతంగా దాచలేరు. ప్రభుత్వాలు మారినా పాలనా ధోరణి మారకపోతే ప్రజల విశ్వాసం క్రమంగా కరిగిపోతుంది. పాలకులు ఇప్పటికైనా హామీల రాజకీయాల నుంచి బాధ్యతాయుత పాలన వైపు అడుగులు వేయాలి.

# విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

- ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు
- సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:**

జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

- మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో..
- ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ,ఆగస్టు 3:**

మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితుల వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది.20162019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్, ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనం వైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

# జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పేపర్ లీక్‌పై విచారణ జరపాలి

- నిరాహార దీక్షకు దిగిన విద్యార్థులు.. ఆందోళన
- ఆందోళనకు సీజేపీ నేత అభిజిత్ దీప్కే మద్దతు

**రాంచీ, ఆగస్టు 3:**

నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీ ఉద్రిక్తంగా మారగా ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో ఆదివారం నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. 'జేపీఎస్‌సీ పరీక్ష ఫలితాలు గత నెల విడుదలయ్యాయి.. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం.. కొన్ని వారాలుగా నిరసనలు జరుగుతున్నా విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్‌సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైనాయి.. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు.. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను.. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం' అని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోందంటూ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిరసనకారులతో మాట్లాడాం.. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని మహతో చెప్పారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు.

# బంకీపూర్‌లో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం

**పాట్నా, ఆగస్టు 3:**

బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. సుమారు 20 వేల ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందిన ఆయన, ఈ ఫలితాన్ని బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామంగా అభివర్ణించారు. ప్రజలు రాష్ట్ర నాయకత్వంపై స్పష్టమైన సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. విజయానంతరం మీడియాతో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్, ఇది కేవలం ఒక ఎమ్మెల్యే ఎన్నిక కాదని, బీహార్ భవిష్యత్తు నాయకత్వంపై ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయమని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నాయకత్వాన్ని ప్రజలు అంగీకరించడం లేదని, రాష్ట్రానికి సమర్థమైన నాయకత్వం అవసరమనే సంకేతాన్ని ఈ ఎన్నిక ఇచ్చిందని వ్యాఖ్యానించారు. బీహార్‌కు విద్య, ఉపాధి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితిని మార్చడం అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని, అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రశాంత్ కిషోర్ కోరారు. ఉపాధి అవకాశాల పెంపు, పారిశ్రామికాభివృద్ధి, యువత వలసల నియంత్రణ వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర నాయకత్వం కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి బలమైన కంచుకోటగా ఉన్న బంకీపూర్‌లో జన్ సురాజ్ విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్‌కు ఇదే తొలి విజయం కాగా, ఈ ఫలితం జన్ సురాజ్ పార్టీకి బీహార్ రాజకీయాల్లో కొత్త ఊపు తీసుకురావడంతో పాటు భవిష్యత్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు దోహదపడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# సౌరశక్తిలో.. భారత్ సరికొత్త శకం

## 162.15 గిగావాట్లకు చేరిన స్థాపిత సామర్థ్యం

### పీఎం-ఎస్ఎస్‌వైతో మరింత ముందడుగు • 5,000 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యమే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 3, రాజముద్ర న్యూస్:** స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ వేగంగా ముందడుగు వేస్తోంది. 2014లో కేవలం 3 గిగావాట్లుగా ఉన్న దేశ సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 2026 జూన్ 30 నాటికి 162.15 గిగావాట్లకు చేరింది. దశాబ్ద కాలంలో యాభై రెట్లకు పైగా వృద్ధి నమోదైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన (పీఎం-ఎస్ఎస్‌వై)తో దేశ సౌర విద్యుత్ ప్రస్థానం మరో కీలక దశలోకి ప్రవేశించింది. ఇంధన నిల్వ వ్యవస్థలతో కూడిన 5,000 మెగావాట్ల తేలియాడే సౌర విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.




#### జలాశయాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు

ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. జలాశయాలు, చెరువులపై తేలియాడే సోలార్ ఫొటోవోల్టాయిక్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తారు. వీటికి ఇంధన నిల్వ వ్యవస్థలను అనుసంధానిస్తారు. కనీసం రెండు గంటల విద్యుత్ నిల్వ సామర్థ్యంతో 10,000 మెగావాట్ అవర్స్ ఇంధనాన్ని నిల్వ చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీని ద్వారా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సమయాల్లో రాష్ట్రాలకు అవసరమైన మద్దతు లభిస్తుంది.

#### భూమిపై ఒత్తిడి తగ్గించే కొత్త నమూనా

సౌర విద్యుత్ ప్రాజెక్టులకు పెద్ద మొత్తంలో భూమి అవసరమవుతుంది. తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాలతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. ప్రస్తుతం ఉన్న జలాశయాలు, పారిశ్రామిక చెరువులను వినియోగించడం వల్ల పరిమిత భూ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఇంధన నిల్వ వ్యవస్థల అనుసంధానం విద్యుత్ గ్రిడ్ విశ్వసనీయతను కూడా పెంచుతుంది. రూ.5,070 కోట్ల వ్యయంతో 2026–27 నుంచి 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుతం దేశంలో తేలియాడే సౌర విద్యుత్ సామర్థ్యం సుమారు 700 మెగావాట్లుగా ఉంది. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన ద్వారా దీనికి మరో 5,000 మెగావాట్లు జోడించనున్నారు.

#### ప్రపంచంలో రెండో అతిపెద్ద వృద్ధి మార్కెట్

2025లో భారత్ 37 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని జోడించి వార్షిక సామర్థ్య విస్తరణలో అమెరికాను అధిగమించింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద సౌర విద్యుత్ వృద్ధి మార్కెట్‌గా అవతరించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే 44.61 గిగావాట్ల సామర్థ్యం కొత్తగా అందుబాటులోకి వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన 23.83 గిగావాట్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. దేశ మొత్తం శిలాజేతర ఇంధన సామర్థ్యం 283.46 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 274.68 గిగావాట్లుగా ఉంది.

#### దేశీయ తయారీలో వేగవంతమైన పురోగతి

సౌర మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం 2014లో 2.3 గిగావాట్లు మాత్రమే ఉండగా 2026 మార్చి 31 నాటికి సుమారు 172 గిగావాట్లకు చేరింది. అధిక సామర్థ్య సౌర పీవీ మాడ్యూళ్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం దేశీయ తయారీకి ఊతమిచ్చింది. ఈ పథకం 2024 అక్టోబరు నాటికి దాదాపు రూ.35 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. సుమారు 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించింది. ఆమోదిత నమూనాలు, తయారీదారుల జాబితా ద్వారా సౌర పరికరాల నాణ్యత, పనితీరు ప్రమాణాలకు భరోసా ఏర్పడింది.

#### సౌర పార్కులతో భారీ విద్యుత్ ఉత్పత్తి

దేశవ్యాప్తంగా 39,188 మెగావాట్ల సంయుక్త సామర్థ్యంతో 54 సౌర పార్కులకు ఆమోదం లభించింది. రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రాలుగా మారాయి. రాజస్థాన్‌లోని భడ్లా సౌర పార్కు ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ సముదాయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. దాదాపు 5,700 హెక్టార్లలో విస్తరించిన ఈ పార్కు 2,245 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇక్కడ జరిగిన పోటీ బిడ్డింగ్‌లో యూనిట్ ధర రూ.2.44కు తగ్గడం భారత సౌర విద్యుత్ రంగంలో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

#### ప్రతి ఇంటికీ సూర్య ఘర్ ప్రయోజనాలు

భారీ విద్యుత్ కేంద్రాలతో పాటు గృహాల పైకప్పులపైనా సౌర విద్యుత్ విస్తరిస్తోంది. రూ.75,021 కోట్ల వ్యయంతో ప్రారంభించిన పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన ప్రపంచంలోనే అతిపెద్ద గృహ పైకప్పు సౌర విద్యుత్ కార్యక్రమంగా నిలిచింది. 2026 జూన్ నాటికి 43 లక్షలకు పైగా గృహాలకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించారు. 2025 డిసెంబరు నాటికి రూ.14,771.82 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. 7.7 లక్షలకు పైగా గృహాలు సున్నా విద్యుత్ బిల్లుల ప్రయోజనాన్ని పొందాయి.

#### రైతులకు విద్యుత్‌తో పాటు అదనపు ఆదాయం

పీఎం-కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో సౌరశక్తి వినియోగం వేగంగా పెరుగుతోంది. దాదాపు 11.49 లక్షల ఆఫ్-గ్రిడ్ సౌర పంపులను ఏర్పాటు చేశారు. ఫీడర్ స్థాయి సౌరీకరణ కింద 15.89 లక్షలకు పైగా వ్యవసాయ పంపులను పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. రైతుల భూముల్లో 1,726 మెగావాట్ల వికేంద్రీకృత సౌర విద్యుత్ సామర్థ్యం అందుబాటులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా 21.77 లక్షలకు పైగా రైతులు ప్రయోజనం పొందారు. సాగునీటి అవసరాలు తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను పంపిణీ సంస్థలకు విక్రయించి ఆదాయం పొందే అవకాశం రైతులకు లభిస్తోంది.

అంతర్జాతీయ సౌర కూటమి, ఒకే సూర్యుడు–ఒకే ప్రపంచం–ఒకే గ్రిడ్ వంటి కార్యక్రమాలతో ప్రపంచ సౌర సహకారంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన

#### స్వచ్ఛ ఇంధన నాయకత్వం దిశగా భారత్

సామర్థ్యం, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాల సాధన లక్ష్యాల దిశగా దేశం ముందుకు సాగుతోంది. స్థిరమైన విధానాలు, దేశీయ తయారీ, బలమైన మౌలిక సదుపాయాలు, ప్రజల భాగస్వామ్యం కొనసాగితే భారత స్వచ్ఛ ఇంధన పరివర్తనలో సౌరశక్తి ప్రధాన చోదక శక్తిగా నిలవనుంది.

## 78 శాతం ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ పూర్తి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లాలో 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రత్యేక సమగ్ర సవరణ పై జిల్లాల వారీగా ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో 78 శాతం పూర్తి చేశామని, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిదులతో సమావేశము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎ.ఎస్.డి(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) కేసులను గుర్తించి ఏ ఎస్ డి లిస్టు వెరిఫై చేసి నియమ నిభంధనల మేరకు డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటా చారి, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి , తహసిల్దార్ లక్ష్మీనారాయణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ సంబంధిత అధికారులు ,తదితరులు ఉన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### జిల్లా కలెక్టర్ కి టీజేఏ ఖమ్మం జిల్లా కమిటీ వినతి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.కు వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగస్వామి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు వివక్ష లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (TJA) డిమాండ్ చేసింది. ఈ మేరకు అర్హులైన ప్రతి విలేకరికి తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. పెరుగుతున్న ధరల కాలంలో జర్నలిస్టులు ఇండ్ల అద్దెలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని TJA నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ జర్నలిస్టుల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు నివాస ధీమా కల్పించాలని టిజేఏ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కొమ్మమూరు మణికుమార్ జిల్లా అధ్యక్షుడు జి. నాగస్వామి జిల్లా కార్యదర్శి మత్తి రామకృష్ణ జిల్లా నాయకులు సయ్యద్ ఖాసీం వాసం రాజేంద్ర ప్రసాద్ రాము రమేష్ సతీష్ సిహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్ పంపించేసిన కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ పంపిణీ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన, సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాని సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా యాలాల్ మండలం, అన్నసాగర్ గ్రామానికి చెందిన దివ్యాంగ లబ్ధిదారుడు కర్రె అశోక్ కు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి చేతుల మీదుగా ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు కర్రె అశోక్ ప్రభుత్వం అందించిన ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాన్ని అందుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, దివ్యాంగుల సంక్షేమ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వాహనాన్ని స్వయం ఉపాధి కోసం వినియోగించి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరుచుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి (దివ్యాంగుల సంక్షేమ శాఖ) కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ 15వ వార్డులో రూ. 39.5 లక్షలతో స్టాంప్ డ్యూటీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులని, 11వ వార్డులో రూ. 37.6 లక్షలతో స్టాంప్ డ్యూటీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులని,14 వ వార్డు లో మునిసిపల్ రూ. 5.9 లక్షలతో నిధులతో నిర్మిస్తున భూగర్భ మురుగు కాలువ పనులని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యోగేష్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగా రెడ్డి, కౌన్సిలర్లు ఫైముదా బేగం సమ్మి,గిరిజ శేకర్, అశోక్, గణేష్, కో ఆప్షన్ సభ్యులు బాలకృష్ణ రెడ్డి, మహమూద్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, నాయకులు బాలకృష్ణ, అనంతరెడ్డి, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు చెట్లే ఆధారం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం అత్యవసరమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు సకాలంలో వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఈరోజు నాటిన మొక్కలే రేపటి తరాలకు మహా వృక్షాలుగా మారి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని, ఎండాకాలంలో ఉష్ణోగ్రతల తీవ్రతను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని చెప్పారు. పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కట్కాల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దం అశోక్, టిఏ. ప్రసాద్, వార్డు సభ్యుడు పెరుగు లింగమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంచినీటి బావి ప్లాట్ఫారం నిర్మాణానికి భూమిపూజ



**రాజముద్ర న్యూస్, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని భారేవాడ 1, 2, 3 వార్డుల ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలనే లక్ష్యంతో మంచినీటి బావి ప్లాట్ఫారం నిర్మాణ పనులకు సోమవారం తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకుముందు మంచినీటి బావిలో పేరు కుపోయిన పూడికను తొలగించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్లోరినేషన్ చేయించారు. వర్షాకాలంలో కలుషిత నీటితో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి. ఈసా, వార్డు సభ్యులు ఓడ్నాల రమేష్, పులగం శ్రీకాంత్, నాయకులు సప్ప హరీష్, ఎం.ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**రాజముద్ర న్యూస్, ఇచ్చోడ:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా అన్నారు. సోమవారం మండలంలోని మాధాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హోమ్స్టెడ్ ప్లాంటేషన్, ఇంటింటికీ మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. గ్రామ ప్రజల సహకారంతో మాధాపూర్ను పచ్చని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. నేడు నాటిన మొక్కే రేపటి మానవాళి జీవనాధారమని అనానరు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయి పోటీలు

**ముఖ్య అతిథిగా జిల్లా యువజన, క్రీడల అధికారి నరసింహులు**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్లోని మై భారత్ (మేరా యువ భారత్) ఆధ్వర్యంలో 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ (మేరా యువ భారత్) వికారాబాద్ సంస్థ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయి పోటీలు వికారాబాద్లోని మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి నరసింహులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్, మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఖలీల్ ఈ కార్యక్రమానికి హాజరై, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణ ఉద్యమంలో యువత చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద కార్యకర్తలు, యువత జిల్లా స్థాయి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఈ క్రింది విభాగాలలో పోటీలు నిర్వహించబడ్డాయి :**

1). జానపద సంగీత పోటీ
2). నృత్య పోటీ
3). లఘుచిత్రం / రీల్ పోటీ
4). నుక్కడ్ నాటకం / మైమ్ స్లామ్ పోయెట్రీ పోటీ
5). వాదోపవాదాలు / వక్తృత్వ పోటీ
6). చిత్రలేఖన పోటీ
7). నినాద రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ఈ పోటీలు యువత తమ సృజనాత్మకతను ప్రదర్శించడానికి, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడానికి, నషా ముక్త్ భారత్ అభియాన్ సందేశాన్ని బలోపేతం చేయడానికి ఒక వేదికను అందించాయి. పాల్గొన్న వారందరి అద్భుతమైన ప్రదర్శనలను ప్రముఖులు ప్రశంసించి, విజేతలను అభినందించారు. ప్రతి పోటీలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలలో వికారాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక చేశారు. డీన్, అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్న వారి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని మై భారత్ (మేరా యువ భారత్) వికారాబాద్ బృందం సమర్థవంతంగా సమన్వయం చేసింది. మై భారత్ వాలంటీర్లు, సిబ్బంది దాసరి శ్రీశైలం, ఉపాధ్యాయుడు రఘునాథ్, కె.రవి, కాజా కరీముద్దీన్, కార్తీక్, అర్చన సింహాద్రి సమన్వయం చేయడంలో చురుకుగా పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం

**వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణ, విస్తరణ చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి పట్టణంలో ప్రస్తుతం పనిచేస్తున్న సీసీ కెమెరాలు, బ్లైండ్ స్పాట్లు, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు తదితర సున్నిత ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటు ప్రణాళికను సమగ్రంగా సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, ప్రజల భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం, పట్టణంలో ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, గ్రామ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

జిల్లాలో సీసీ కెమెరాల విస్తరణ పనులను డీఎస్పీలు, సీఐలు నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్ బీ జానయ్య, తాండూర్ డీఎస్పీ యాదయ్య, సీఐలు, ఎస్.ఐ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలి

**మహీంద్రా యూనివర్సిటీ కాన్వొకేషన్లో ఆనంద్ మహీంద్రా**






**కుత్బుల్లాపూర్ రాజముద్ర న్యూస్:** మారే భవిష్యత్తుకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము మలుచుకోవాలని మహీంద్రా యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా పిలుపునిచ్చారు. హైదరాబాద్లోని బహదూర్పల్లిలో ఉన్న మహీంద్రా యూనివర్సిటీ ఐదో వార్షిక కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, వేగంగా మారుతున్న ప్రపంచంలో ఊహించని సవాళ్లను ఎదుర్కోవడానికి 'రూపాంతరం చెందే సామర్థ్యం', 'అంతర్గత మానసిక బలం' అనే రెండు కీలక శక్తులు విద్యార్థులకు అత్యవసరమని పేర్కొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బజాజ్ ఆటో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ మాట్లాడుతూ.. వేగవంతమైన సాంకేతిక మార్పులను పసిగట్టి, నిరంతరం నేర్చుకునే తత్వంతో ముందుకెళ్లినప్పుడే విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే నూతన బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. అలాగే యూసీ శాన్ డియాగో ఛాన్సలర్ ప్రదీప్ కే ఖోస్లా, వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి ప్రసంగిస్తూ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 1,309 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేయగా, వారిలో 22 మంది పీహెచ్డీ గ్రాడ్యుయేట్లు, అసాధారణ ప్రతిభ కనబరిచిన 29 మంది స్వర్ణ పతక విజేతలు ఉన్నారు.

# 2వ విడత గృహ నిర్మాణం, లబ్ధిదారుల సమాచార పరిశీలనను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్:** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడత గృహ నిర్మాణ పనులు, లబ్ధిదారుల డెస్క్ పరిశీలన, ఫీల్డ్ పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో లబ్ధిదారుల డెస్క్ పరిశీలన ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. కాగజ్నగర్ మున్సిపాలిటీ పరిధిలో 10లోపు, కెరమెరి మండలంలో 13 మాత్రమే పెండింగ్లో ఉన్నందున మంగళవారం నాటికి డెస్క్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్-టి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్పేట్, వాంకిడి, లింగాపూర్, రెబ్బెన తదితర మండలాలలో 100 కంటే తక్కువ దరఖాస్తులు పెండింగ్లో ఉన్నందున శనివారం సాయంత్రంలోగా తప్పనిసరిగా పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో లేని అర్హులైన హట్ డ్వెల్లర్స్ ఎవరైనా ఉన్నట్లయితే, వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించి, ఫోటోలతో సహా నిర్దేశిత ఆన్లైన్ ప్లాట్ఫారమ్లో నమోదు చేయాలని తెలిపారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలలో లబ్ధిదారుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ పరిశీలించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 500 రూఫ్ రీప్లేస్మెంట్ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని, గోడలు బాగుండి, కేవలం పైకప్పు మార్పిడి అవసరమున్న ఇళ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్.సి. లెవల్లో ఉన్న 2 వేల 712 గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, జైనూర్ మండలంలో 369 ఇళ్లు, కాగజ్నగర్, కెరమెరి ప్రాంతాలలో అధిక సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలవుతాయని, ఈ విషయంపై గుత్తేదారులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతంగా పూ ర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెస్క్ పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, తప్పుడు వివరాలకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయ ఇంజనీర్లు (ఏఈలు), ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్లాస్గోలో ముగిసిన కామన్వెల్త్ క్రీడలు







**గ్లాస్గో, ఆగస్టు 3 :** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన కామన్వెల్త్ క్రీడలు-2026 ఆదివారం ముగిశాయి. జూలై 23న ప్రారంభమైన ఈ బహుళ క్రీడల మహోత్సవం ముగింపు వేడుకలతో తెరపడింది. ఈసారి బడ్జెట్ పరిమితుల కారణంగా కేవలం 10 క్రీడా విభాగాల్లోనే పోటీలు నిర్వహించినప్పటికీ, 74 దేశాలకు చెందిన వేలాది మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. భారత అథ్లెట్లు మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతూ మొత్తం 39 పతకాలు సాధించారు. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, కెనడాల తర్వాత నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 61 పతకాలు సాధించినప్పటికీ, ఈసారి పతకాల సంఖ్య తగ్గింది. అయితే దీనికి ప్రధాన కారణం షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి భారత్‌కు సంప్రదాయంగా ఎక్కువ పతకాలు అందించే క్రీడలను ఈ ఎడిషన్ నుంచి తొలగించడమేనని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. పరిమిత అవకాశాల్లో నూ భారత క్రీడాకారులు అద్భుత పోరాట పటిమ కనబరిచారు.

## 39 పతకాలతో భారత్‌కు నాలుగో స్థానం

- 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు సాధించిన భారత అథ్లెట్లు
- 2030 కామన్వెల్త్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం.. బాధ్యతల బదిలీ పూర్తి



ముఖ్యంగా మహిళా అథ్లెట్లు స్వర్ణ పతకాల వేటలో కీలక పాత్ర పోషించి భారత్‌కు గర్వకారణంగా నిలిచారు. కామన్వెల్త్ క్రీడలు ముగియడంతో భారత క్రీడాకారుల దృష్టి ఇప్పుడు ఆసియా క్రీడలపై కేంద్రీకృతమైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక క్రీడలకు వేదిక కానుంది. 2010లో ఢిల్లీలో విజయవంతంగా కామన్వెల్త్ క్రీడలను నిర్వహించిన భారత్, రెండోసారి ఈ మహోత్సవానికి ఆతిథ్యం ఇవ్వనున్న దేశంగా నిలవనుంది. ఆస్ట్రేలియా తర్వాత కామన్వెల్త్ క్రీడలను రెండుసార్లు నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. గ్లాస్గోలో జరిగిన బాధ్యతల బదిలీ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవీ భారత తరపున కామన్వెల్త్ జెండా, బ్యాటన్‌ను స్వీకరించారు. దీంతో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు అహ్మదాబాద్‌లో జరగనున్న 2030 కామన్వెల్త్ క్రీడలపై పడింది.

# మహిళల ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన






## హర్మన్‌ప్రీత్‌కే కెప్టెన్సీ.. స్మృతి మందానా వైస్ కెప్టెన్

**గాయం కారణంగా శ్రేయాంకకు దక్కని చోటు**

**స్టార్ ఆటగాళ్లతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో టీమిండియా**

**ముంబై, ఆగస్టు 3 :** మహిళల ఆసియా కప్--2026 టోర్నీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం భారత జట్టును ప్రకటించింది. అనుభవజ్ఞురాలైన హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మందానా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనుంది. అనుభవం, యువ ప్రతిభ కలయికతో కూడిన జట్టును ఎంపిక చేయడంతో ఈసారి కూడా భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. జట్టులో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్, దీప్తి శర్మ, రాధా యాదవ్ వంటి కీలక ఆటగాళ్లకు చోటు లభించింది. వికెట్‌కీపర్లుగా రిచా ఘోష్‌తో పాటు జి. కమలినిని ఎంపిక చేశారు. అయితే యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌కు ఈసారి నిరాశ ఎదురైంది. చీలమండ లిగమెంట్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆమెను జట్టుకు దూరంగా ఉంచారు. ఇదే గాయం కారణంగా గతంలో టీ20 ప్రపంచకప్‌ను కూడా ఆమె మధ్యలోనే వీడాల్సి వచ్చింది. అయితే సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల నాటికి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మహిళల ఆసియా కప్-2026 షెడ్యూల్‌ను ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వరకు టోర్నీ నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు ఆసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. రిజర్వ్ జాబితాలో ప్రతీకా రావల్, ఉమా చేత్రీ, వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేయడం జట్టుకు అదనపు బలంగా మారనుంది. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మందానా (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, రాధా యాదవ్, ప్రేమా రావత్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్, ఎన్. శ్రీ చరణి, నందిని శర్మ.

**రిజర్వ్ ఆటగాళ్లు:** ప్రతీకా రావల్, ఉమా చేత్రి (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి.

# శ్రీలంకతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్

- డబ్ల్యూటీసీ ఫైనల్ రేసే లక్ష్యం
- ఆగస్టు 15 నుంచి శ్రీలంక పర్యటన.. భారత్‌కు కీలక సిరీస్
- మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 7 విజయాలు అవసరమన్న విశ్లేషకులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** జింబాబ్వే పర్యటన అనంతరం స్వల్ప విరామం తీసుకున్న భారత క్రికెట్ జట్టు ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)పై పూర్తిగా దృష్టి సారించింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటనతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్‌కు శ్రీకారం చుట్టనుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. జట్టు ఖాతాలో ఇంకా తొమ్మిది టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇందులో శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్ పర్యటనలో రెండు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టులు ఉన్నాయి. ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ తొమ్మిది మ్యాచ్‌ల్లో కనీసం ఏడు నుంచి ఎనిమిది విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు పట్టికలో ముందంజలో కొనసాగుతున్నాయి. ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ హయాంలో టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో ఆయన కోచింగ్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ వికెట్‌కీపర్, క్రికెట్ వ్యాఖ్యాత దీప్ దాస్‌గుప్తా స్పందిస్తూ గంభీర్‌కు ఇది కీలక పరీక్ష అని వ్యాఖ్యానించారు. జట్టు ఆశించిన స్థాయిలో రాణించనప్పుడు కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నలు రావడం సహజమేనని అన్నారు. గత మూడు టెస్టు సిరీస్‌ల్లో రెండింటిని కోల్పోయిన నేపథ్యంలో ఒత్తిడి ఉండటం సహజమే అయినప్పటికీ, గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు భారత ఆటగాళ్లకు ఆ ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. జట్టులో జరుగుతున్న మార్పులపై కూడా దాస్‌గుప్తా సందేహాలు వ్యక్తం చేశారు. న్యూజిలాండ్ టెస్టు సిరీస్ నుంచి మార్పుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, అవి ఏ దిశగా సాగుతున్నాయనే విషయంలో స్పష్టత కనిపించడం లేదన్నారు. శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలు ఎప్పుడూ కఠిన సవాళ్లేనని, ప్రస్తుత పరిస్థితుల్లో ఏ టెస్టు సిరీస్‌ను కూడా తేలికగా తీసుకునే అవకాశం లేదని ఆయన హెచ్చరించారు. మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు విజయాలు సాధించడం టీమిండియాకు పెద్ద సవాలేనని ఆయన అభిప్రాయపడ్డారు.



# మ్యాచ్ ఫిక్సింగ్.. ఐసీసీ కొరడా

**భారత సంతతి ఆటగాడు అఖిలేష్ రెడ్డికి ఎనిమిదేళ్ల నిషేధం**

**అబుదాబి టీ10 టోర్నీలో అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘన**

**చాట్‌లు, కాల్ రికార్డులు తొలగించినందుకూ అదనపు చర్యలు**

**దుబాయ్/హైదరాబాద్, ఆగస్టు 3 :** అమెరికా తరపున ఆడుతున్న భారత సంతతి క్రికెటర్ బొడుగుమ్ అఖిలేష్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై ఎనిమిదేళ్లపాటు అన్ని రకాల క్రికెట్ నుంచి నిషేధం విధించింది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని, 2033 నవంబర్ వరకు కొనసాగుతుందని ఐసీసీ వెల్లడించింది. హైదరాబాద్‌లో పెరిగిన 26 ఏళ్ల అఖిలేష్ రెడ్డి కుడిచేతి బ్యాటర్, ఆఫ్‌స్పిన్ బౌలర్. 2025లో అమెరికా జాతీయ జట్టు తరపున నాలుగు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అయితే 2025 అబుదాబి టీ10 టోర్నీ సందర్భంగా ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని లేదా మ్యాచ్‌లోని ఇతర అంశాలను అక్రమంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం ద్వారా అవినీతి నిరోధక కోడ్‌లోని నిబంధనలను ఉల్లంఘించాడు. అలాగే మ్యాచ్ ఫిక్సింగ్‌లో పాల్గొనాలని మరో ఆటగాడిని ప్రోత్సహించడం, ప్రేరేపించడం కూడా నిర్ధారణ అయింది. దర్యాప్తు ప్రారంభమైన తర్వాత తన మొబైల్ ఫోన్‌లోని చాట్‌లు, కాల్ రికార్డులు, ఇతర డేటాను తొలగించి విచారణకు ఆటంకం కలిగించినట్లు కూడా ట్రిబ్యునల్ గుర్తించింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ అతడిపై సుదీర్ఘ నిషేధాన్ని విధించింది. ఈ శిక్షతో అఖిలేష్ రెడ్డి క్రికెట్ కెరీర్‌కు దాదాపు ముగింపు పలికినట్టేనని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘనకు గురై దీర్ఘకాల నిషేధం ఎదుర్కొన్న అమెరికా రెండో అంతర్జాతీయ క్రికెటర్‌గా అఖిలేష్ రెడ్డి నిలిచాడు. క్రికెట్‌లో పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడేందుకు అవినీతి నిరోధక నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తామని ఐసీసీ మరోసారి స్పష్టం చేసింది.



# బ్రిజ్ భూషణ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

## లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా తీర్పు

**డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌కూ విముక్తి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 :** భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించిన కేసులో బ్రిజ్ భూషణ్‌తో పాటు డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌ను ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశ్వినీ పన్వార్ విచారణ అనంతరం ఈ తీర్పు వెలువరించారు. గురువారం వాదనలు పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం తాజాగా ఇద్దరికీ విముక్తి కల్పించింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదుల ఆధారంగా ఢిల్లీ పోలీసులు 2023 జూన్‌లో బ్రిజ్ భూషణ్‌పై ఐపీసీ సెక్షన్లు 354, 354ఏ, 354డీ, 506 కింద అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం 2024 మేలో లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కేసుల్లో అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అయితే ఒక ఫిర్యాదుదారు చేసిన ఆరోపణల విషయంలో అప్పుడే ఉపశమనం లభించగా, మిగిలిన కేసులపై విచారణ కొనసాగింది. విచారణ కాలమంతా బ్రిజ్ భూషణ్, వినోద్ తోమర్ బెయిల్‌పై ఉన్నారు. మూడేళ్ల క్రితం పలువురు ప్రముఖ భారత మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ చేపట్టిన ఆందోళనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయనను అరెస్టు చేయాలంటూ జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించాయి. తాజా తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, తాను ఎలాంటి తప్పు చేయలేదని మొదటి నుంచే చెబుతున్నానని అన్నారు. తనపై కుట్ర జరిగిందని, నిజం చివరకు న్యాయస్థానం ముందు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించడం తనకు, తన కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. జూనియర్ అథ్లెట్ల హక్కుల పరిరక్షణ కోసం తాము కృషి కొనసాగి స్తామని ఆయన తెలిపారు.




# 'ఇరుముడి' నుంచి 'యాలాలో.. యాలాలో' విడుదల

## ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'ఇరుముడి'

**హైదరాబాద్, ఆగస్టు 3 :** మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ భావోద్వేగ కుటుంబ కథా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చిత్రం నుంచి రెండో ' తం 'యాలాలో.. యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..'ను విడుదల చేసింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, ఆప్యాయత, భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ మెలోడీ తొలి వినికిడిలోనే సం' తాభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని తాకే సాహిత్యాన్ని అందించగా, సం' త దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మధురమైన స్వరాలతో పాటకు మరింత అందాన్ని చేకూర్చారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో కనిపించిన ఆప్యాయ దృశ్యాలు సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి ' తం 'ఇరుముడి కట్టు' భక్తి ' తంగా విశేష ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో.. యాలాలో'తో చిత్రంపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో రవితేజ ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రీ-కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంటుందని తెలిపింది. తన కుమార్తె కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి భావోద్వేగ ప్రయాణాన్ని ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా చిత్రబృందం తెరదించింది. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేసింది. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'టాక్సిక్' పాటపై ట్రోలింగ్

## కియారాకు హుమా అండ

- మహిళలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు?
- యశ్‌పై మౌనం.. కియారాపై విమర్శలు ద్వంద్వ వైఖరి: హుమా ఖురేషి
- 'ఆగస్టు 26న సినిమా చూసి సమాధానం చెప్పండి'





**ముంబై, ఆగస్టు 3 :** రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా, ' తు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'టాక్సిక్' విడుదలకు ముందే చర్చనీయాంశమైంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించినప్పటికీ, అందులో యశ్, కియారా అద్వానీ మధ్య చిత్రీకరించిన కొన్ని సన్నిహిత సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పాట విడుదలైన తర్వాత వివాహిత, ఇటీవల తల్లిగా మారిన కియారా అద్వానీ ఇలాంటి సన్నివేశాల్లో నటించడంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. కొందరు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల ఖాతాల్లో కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్ కూడా వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి అయినప్పటికీ ఆయనపై ఎలాంటి విమర్శలు రాకపోవడాన్ని సినీ వర్గాలు ద్వంద్వ వైఖరిగా అభివర్ణిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బాధాకరమని అన్నారు. పాత్రలో భాగంగా నటించిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి తీర్పులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ఇలాంటి ట్రోలింగ్‌కు ప్రత్యేకంగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఆగస్టు 26న విడుదలయ్యే 'టాక్సిక్' సినిమానే అందరికీ సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. హుమా ఖురేషి వ్యాఖ్యలకు నటుడు సాకిబ్ సలీమ్ మద్దతు పలికారు. సోషల్ మీడియాలో నటీనటుల వ్యక్తిగత జీవితాలపై తీర్పులు ఇవ్వడం ప్రమాదకర ధోరణి అని పేర్కొన్నారు. బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ గారెట్ కూడా స్పందిస్తూ, యశ్‌ను విమర్శించకుండా కియారాను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సమాజంలో ఇంకా కొనసాగుతున్న లింగ వివక్షకు నిదర్శనమని అన్నారు. నటీనటులు తమ వృత్తిలో భాగంగా పాత్రలను పోషిస్తారని, వాటిని వారి వ్యక్తిగత జీవితాలతో ముడిపెట్టకూడదని సూచించారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




# ఎల్లమ్మలో పర్షిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల

దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్షిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్షిగా అతను లుక్‌ను విడుదల చేశారు.

# అతీంద్రియ శక్తుల కథ.. అగధ




## 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవు తోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# స్పైడర్ మ్యాన్ కెలక్షన్ల దూకుడు

టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ.11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ.310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com